క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వెంకన్న స్వామి

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన శనివారం కావడంతో అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు.

నక్కపేటలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

లావేరు: విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని శివానీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. నక్కపేటలో శనివారం శివానీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు వారం రోజుల పాటు సామాజిక, ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులపై ఇంటింటా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ బి.ప్రసాదరావు, సమన్వయకర్త విజయకృష్ణ, హెచ్ఎం కె.మోహనరావు, గ్రామ కమిటీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



కృష్ణవేణిని సత్కరిస్తున్న వైద్యసిబ్బంది

జి.సిగడాం: మండలంలోని దేవరవలస ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తూ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న పి.కృష్ణవేణిని శనివారం బాతువ ఆరోగ్యకేంద్రంలో సత్కరించారు. వైద్యులు గజినీ అనుషా, ప్రతిష్ట శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓ ఎల్.లక్ష్మణరావు, పీహెచ్ఎన్ ఎండీ కృపావతి, హెచ్ఎస్ వెంకటనాయుడు హెచ్‌వీ వై.సుగణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూముల సర్వేతో రైతులకు మేలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి

లావేరు: సమగ్ర భూముల సర్వేతో రైతులకు మేలు కలుగుతుందని తహసీల్దార్ ఎస్.దిలీప్ చక్రవర్తి అన్నారు. శిగురుకొత్తపల్లిలో శనివారం సమగ్ర భూముల సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం సమగ్ర భూముల సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. సర్వేకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ మీసాల రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం



ఇబ్రహింబాద్‌లో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ రవికుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ అన్నారు. ఇబ్రహింబాద్ గ్రామ సచివాలయం, ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం)ను శనివారం పరిశీలించారు. స్వామిత్వ సర్వేపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం పక్కాగా జరగాలన్నారు. రోడ్లపై నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులను నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

చకచకా ఆధార్ అనుసంధానం

- పారదర్శక ఓటరు జాబితాయే లక్ష్యం
- సచివాలయం యూనిట్‌గా నమోదు ప్రక్రియ



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం. అదే సమయంలో ఓటరు జాబితా సైతం ఎటువంటి లోపాలకు, అక్రమాలకు తావులేకుండా ఉండాలి. ఈ నేపథ్యంలో పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా ఆధార్ నంబర్లతో ఓటర్లను అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. గ్రామ సచివాలయాల్లో బూత్ లెవల్ అధికారులు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ప్రధానంగా చనిపోయిన వారి ఓట్లను కుటుంబ సభ్యుల ధ్రువీకరణతో చేస్తున్నారు. గతంలో ఒకే వ్యక్తికి రెండు మూడు ప్రాంతాల్లో ఓట్లు ఉండటం , డబుల్ ఎంట్రీ ఓట్లు ఉండటం జరిగేది. ప్రస్తుతం ఒక చోట కంటే ఎక్కువ ఓట్లు ఉంటే వ్యక్తి అభిప్రాయం పరిగణనలోకి తీసుకొని ఒక్కచోట మాత్రమే ఓటు హక్కు కల్పిస్తున్నారు. మరోవైపు ఓటు హక్కు వినియోగంలో సైతం పారదర్శకత కోసం ఫొటోలతో ఓటర్ జాబితాలు రూపొందించడం, ఓటు హక్కు వినియోగ సమయంలో ఎన్నికల సంఘం ఓటరు స్లిప్పులు సరఫరా చేయటం, గుర్తింపు కార్డు తప్పనిసరి చేయటం వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఓటరు జాబితాకు శతశాతం ఆధార్ నమోదు ప్రక్రియ మరికొద్ది రోజుల్లో పూర్తికానుంది. మరోవైపు 19-ఏ ధ్రువీకరణ పత్రాలు కొత్త ఓటర్లను జాబితాలో చేర్పు సమయంలో సైతం ఆధార్ నంబరు తప్పని సరిచేసి, సీడింగ్ చేస్తున్నారు. ఇలా ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించే పనిలో ఓటర్ల నమోదు అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు.

ఎచ్చెర్ల నియోజకవర్గం పరిస్థితి...

మండలం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	ఆధార్ సీడింగ్ పూర్తి	పూర్తికానివి	పూర్తయిన శాతం
రణస్థలం	87	65939	61443	4496	93.18
లావేరు	69	53377	47119	6258	93.18
జి.సిగడాం	63	45058	38758	5300	88.24
ఎచ్చెర్ల	90	71556	61546	10010	86.01
మొత్తం	309	235930	209866	26064	88.95

పక్కాగా జాబితా..

ఎన్నికల సంఘం పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించటం లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అందుకే ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నాం. దీని వల్ల ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉంటుంది. సచివాలయం యూనిట్‌గా బూత్ లెవల్ అధికారులు ఆధార్ నమోదు కార్యక్రమం పర్యవేక్షిస్తున్నారు.

– మురళీకృష్ణ,
ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి

మహిళాభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం



రణస్థలం: సంచాంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మహిళలు



ఎచ్చెర్ల క్యాంపస్:మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి



గార: మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్

రణస్థలం: మహిళల ఆర్థిక స్వావలంబనే సీఎం జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. పాతర్లపల్లి, రణస్థలం, సంచాం తదితర గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో శనివారం మూడో విడత వైఎస్సార్ ఆసరా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రణస్థలం మండలంలో 2040 సంఘాల్లోని 22,122 మంది సభ్యులకు రూ.18.01 కోట్లు, ఎచ్చెర్ల మండలంలో 2024 సంఘాల్లోని 22437 మంది సభ్యులకు రూ.17.48 కోట్లు, లావేరు మండలంలో 1623 సంఘాల్లోని 17,553 మంది సభ్యులకు రూ.15.18 కోట్లు, జి.సిగడాం మండలంలో 1078 సంఘాల్లోని 12,261 మంది సభ్యులకు రూ.8.93 కోట్లను వ్యక్తిగత ఖాతాలకు జమ చేశారని వివరించారు. సమావేశంలో పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, సంచాం సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం, నాయకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఫరీదుపేటలో వైఎస్సార్ ఆసరా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, ఏపీఎం రమణమూర్తి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: వైఎస్సార్ ఆసరాను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెదలింగాలవలస పంచాయతీ సర్పంచ్ లుకలాపు యశోద, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు అన్నారు. పెదలింగాలవలసలో వైఎస్సార్ ఆసరాపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైకేపీ సీసీలు దమయంతి, వీఓఏలు నిర్మల, నాగేశ్వరరావు, పతివాడ గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గార: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఆసరా పథకం దోహదపడుతుందని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆసరా పథకంపై సర్పంచ్, వెలుగు సిబ్బందికి సమావేశం నిర్వహించారు. సోమవారం గారలో నిర్వహించనున్న ఆసరా సమావేశానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శిమ్మ రామ్మోహన్, అరవల రామకృష్ణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: కిల్లిపాలెం పంచాయతీలో ఈ నెల 28న జరిగే వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీకాకుళం జెడ్పీటీసీ రుప్ప దివ్య పిలుపునిచ్చారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సింగుపురం, క్లోపల్లి పార్టీ నాయకులు, ఎన్ఆర్‌జీఎస్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లోపల్లి, పిజిపేట, ఇప్పిలి, బలివాడ, కనుగులవానిపేట, కుందువానిపేట, వప్పంగి, ఖాజీపేట పరిసర ప్రాంతాలకు చెందిన ఆసరా లబ్ధిదారులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, ఎంపీడీఓ రఘు, ఏపీఎం సుజాత, సర్పంచ్‌లు గంగు నరేంద్ర కుమార్, లోలుగు శ్రీనివాసరావు, పొన్నాన కూర్మారావు, నాయకులు తంగి ఈశ్వరరావు, తంగి శ్రీపతి, తంగిరవి, నక్క శంకర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు మెట్టవలస విద్యార్థి ఎంపిక




మధును అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

లావేరు: ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి మెట్టవలస హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న గొర్లె మధు ఎంపికైనట్లు హెచ్ఎం మజ్జి మురళీకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. మధును మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ టి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రణస్థలం: 2020–21 ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పిన్నింటి భానోజీనాయుడు డిమాండ్ చేశారు. రణస్థలంలో శనివారం సర్పంచ్–గ్రామాల సమస్యలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


విశ్రాంత కమిషనర్ మృతికి సంతాపం



గోవిందస్వామి (ఫైల్)

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరపాలకసంస్థలో రెండుసార్లు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఎస్.గోవిందస్వామి శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు గుండె పోటు రావడంతో విశాఖపట్నంలో మరణించారు. పైడిశెట్టి జయంతి, ఎం.వి.పద్మావతిలు చైర్‌పర్సన్లుగా వ్యవహరించినప్పుడు గోవిందస్వామి సుమారు నాలుగున్నరేళ్లపాటు కమిషనర్‌గా ఉంటూ పట్టణాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఈ సమయంలో ధర్మాన ప్రసాదరావు మంత్రిగా ఉన్నారు. గోవిందస్వామి మృతి పట్ల మంత్రి ధర్మాన ప్రసాదరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి. పద్మావతి, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు సంతాపం తెలియజేశారు.

32వ వార్డులో కాంగ్రెస్ జోడో అభియాన్



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్: హాథ్ సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని 32వ వార్డు పరిధిలో జెండాల వీధి, దుంపల వీధి, గుణపాలం చెరువుగట్టు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు నియోజకవర్గ కోర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేశేళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, బైరి రాజేశ్వరరావు, రుష్మితాపాణి, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: పార్టీలకు అతీతంగా, దళారుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. శనివారం జి.సిగడాం మండలం నిద్దాం సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా భావించి రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. అర్హులందరి ఖాతాలకే నేరుగా పథకాల సొమ్ము జమ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా రహదారి, ఇళ్ల మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, జేసీఎ మండల కన్వీనర్ డోల వెంకటరమణ, నాయకులు బూరాడ వెంకటరమణ, పేడాడ శ్రీరామమూర్తి, శ్రీనివాసరావు, నల్లి తవిటినాయుడు, మీసాల రాంబాబు, సర్పంచులు భూపతి సురేష్‌కుమార్, కంది రమాదేవి, వడిశ మహేశ్వరరావు, బుడారి లక్ష్మణరావు, చిత్తిరి మోహన్, పిల్లల శివకుమార్, వెంకట అప్పారావు, బాలి అప్పలసూరి, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఏఈఈ లు కె.తిరుపతిరావు, బగాది భాగ్యలక్ష్మి, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వాన ప్రమీల పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భజన



భజన చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: చిన్నబజారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం భజన కార్యక్రమం నిర్వహించారు. ఈఓ సర్వేశ్వరరావు, అర్చకులు శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో తొగరాం గ్రామానికి చెందిన శ్రీనటరాజ భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు.

గృహ సారథుల పాత్ర కీలకం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



సమావేశానికి హాజరైన గృహసారథులు, వలంటీర్లు

రణస్థలం: గ్రామ సచివాలయ కన్వీనర్ల సారథ్యంలో గృహ సారథులు క్రియాశీలకంగా పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సూచించారు. రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జె.ఆర్.పురం గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు గెలిచిన టీడీపీ నాయకులు 2024లో టీడీపీ అధికారంలోకి వస్తోందని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు జరిగిన ఎమ్మెల్సీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ ఎన్నికల్లో 90 శాతానికి పైగా స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలిచిందని గుర్తుంచుకోవాలన్నారు. 2019 మాదిరిగా అదే ఉత్సాహంతో 2024 ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఎవరికి ఎటువంటి సమస్యలున్నా సర్పంచ్, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లతో సమాలోచనలు చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, పచ్చిగుళ్ల సాయిరాం, ఇడదాసుల తిరుపతిరాజు, దన్నాన సీతారాం, టేకి బ్రహ్మాజీ, షేక్ సైదాల్, మింద్రాన రామారావు పాల్గొన్నారు.

10వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం



పెంట సచివాలయంలో ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే ప్రతి ఆర్‌బీకేకు ఎరువులను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ కె.వి.రమణి అన్నారు. శనివారం సీతంపేట, సంతవురిటి, పాలఖండ్యాం, జి.సిగడాం, ఆనందపురం సచివాలయాల్లో ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 40 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే 10 వేల టన్నులను ఆర్‌బీకేల్లో నిల్వ చేశామన్నారు. రైతులు ముందుగా ఆర్‌బీకే కియోస్క్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రణస్థలం హబ్ మేనేజర్ సుహాసిని మాట్లాడుతూ రణస్థలం పరిధిలో గత ఏడాది 4,850 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలుగోలు లక్ష్మీనారాయణ, సింహాద్రి హరికృష్ణ, పాగిరి నారాయణరావు, ముంతా హరీష్, ముంతా హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద

ఎచ్చెర్ల క్యాంపస్: పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.యశోద అన్నారు. చిలకపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడా వేడుకలు నిర్వహించారు. పౌష్టిహార పదార్థాలను ప్రదర్శించి వాటి ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కర్యకర్త ధనలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న టీచర్లు

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో ప్రశాంతత, మానసిక పరివర్తన సాధ్యమవుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు అన్నారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శనివారం యోగ–ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధ్యానం చేయకపోతే ప్రతికూల శక్తి, అశాంతి పెరిగిపోతుందన్నారు. నిర్దిష్ట ప్రణాళికతో జిల్లావ్యాప్తంగా ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు 7989752675, 8096553331 నంబర్లను సంప్రదించాలని సీనియర్ టీచర్లు వారణాశి సందీప్, దేసూళ సురేంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓఎల్ సభ్యులు, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వ్యవస్థాపకులు రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మీసాల సత్యవతి

జి.సిగడాం: కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ మీసాల సత్యవతి అన్నారు. శనివారం బాతువ ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి అనూషా అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా రోగుల ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, వైద్యాధికారి ప్రతిష్టాశర్మ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చందక సతీష్, పీఏసీఎస్ చైర్మన్ పల్లేడ సన్యాసిరావు, నాయకులు బూటు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి



బీఎల్వోలతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ మురళీకృష్ణ

రణస్థలం: ఓటర్‌కు ఆధార్ అనుసంధానం శతశాతం జరగాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పి.మురళీ కృష్ణ తెలిపారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఓటర్‌తో ఆధార్ అనుసంధానం 90శాతం కన్నా తక్కువ ఉన్న బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 309 పోలింగ్ స్టేషన్లు, 2,36,226 ఓటర్లు ఉన్నారని, అందులో 2,11,026 మంది ఓటర్ల ఆధార్ అనుసంధానం పూర్తయిందని వివరించారు. మిగిలిన 25,200 మంది ఓటర్ల ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలన్నారు. అనంతరం కొవ్వాడలో అణువిద్యుత్ సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎన్నికల డీటీ జి.కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కంఠ వేణుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కంఠ వేణు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళిత రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కంఠ వేణు.. హోలీస్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఆనంద్‌కుమార్, బిషప్ డాక్టర్ జి.శామ్యూల్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో జరిగిన కార్యక్రమంలో వేణు మాట్లాడుతూ దళితుల, బహుజనులు, ప్రజాస్వామ్యబద్ధమైన హక్కుల పరిరక్షణకు పనిచేస్తున్నందుకు డాక్టరేట్ అందజేయడం ఆనందంగా ఉందన్నారు.